క్లుప్తంగా

20న కార్తీక వనభోజనాలు


మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక లక్ష్మీపురంలోని బాలాజీ దేవాలయంలో ఈ నెల 20న బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు బలిజ సంఘం నాయకులు వెంకటరాముడు, రాయల్ గోపాల్, విజయ్, నారాయణస్వామి, నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కార్తీక వనభోజనాల కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పెద్ద ఎత్తున బలిజలు తరలిరావాలన్నారు.

బాల్య వివాహానికి చెక్

పెనుకొండ రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి పుట్టపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌తో వివాహం చేయడానికి నిర్ణయించారు. మరో రెండు రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. అయితే శనివారం 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కేర్‌కి సమాచారం వెళ్లడంతో పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది సదరు యువకుడికి నోటీసులు జారీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీడీపీఓ శాంత లక్ష్మి తెలిపారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ

హిందూపురం అర్బన్: బ్యాంకుల్లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆయా బ్యాంక్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చొరవచూపాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, డీఎస్పీ కంజాక్షన్‌లతో కలిసి డిసెంబర్ 9న జరిగే మెగా లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. పోలీస్ అధికారులు సైతం పరిష్కారం కాదగిన కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. లేపాక్షికి వస్తున్న యాత్రికులపై అధికంగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుపై న్యాయమూర్తి అధికారులతో చర్చించారు. నిబంధనల మేరకు ఫీజు వసూలు చేసేలా చూడాలన్నారు. సమావేశంలో రెండో తరగతి మెజిస్ట్రేట్ సుకుమార్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, ఏపీపీ సుహాసిని, ఎస్ఐలు, వివిధ బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'వై ఏపీ నీడ్స్ జగన్'

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీలోని మూడో సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

26 నుంచి పక్కాగా కుల గణన


మాట్లాడుతున్న తహసీల్దారు సౌజన్యలక్ష్మీ

పరిగి: ప్రతి సచివాలయ పరిధిలో ఈనెల 26 నుంచి కుల గణన ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. పక్కాగా వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. పరిగిలో ఎంపీడీఓ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్, విద్యుత్ శాఖల అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో ఐసీడీఎస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో కొందరు సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదన్నారు. అలాగే విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి, స్పెషలాఫీసర్ ప్రసాద్‌రావు, కోఆప్షన్ మెంబర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రసన్న లక్ష్మి

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యం ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివశంకరరెడ్డి తెలిపారు. త్వరలోనే చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీ ప్రసన్న పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడాకారిణిని అభినందించారు.

కర్ణాటకకు ఎరువు ఎగుమతి

- సోమందేపల్లి మండలంలోని ఎరువుకు డిమాండ్
- పంటలు బాగా పండుతాయంటున్న కర్షకులు
- లారీ లోడ్ రూ.45 వేల దాకా అమ్మకం

సోమందేపల్లి: మండలంలో లభించే ఎరువుకు డిమాండ్ ఏర్పడింది. ఏకంగా పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువును తీసుకువెళుతున్నారు. ఇక్కడి పశువుల ఎరువును తమ పంట పొలాల్లో వినియోగించడం ద్వారా పంట దిగుబడి వస్తోందని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని తుంగోడు, జూలకుంట, చిన్నబాబయ్యపల్లి గ్రామాల్లో సేకరించిన ఎరువు లారీలో లోడ్ చేసుకుని తరలిస్తున్నారు.

గొర్రెల ఎరువుకు ...

కర్ణాటక రాష్ట్రంలో గొర్రెల పెంపకం తక్కువగా ఉండటంతో ఇక్కడి నుంచి ఎరువులను కొనుగోలు చేయడానికి అక్కడి రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక గామాల్లో గొర్రెల రొప్పాల నుంచి సేకరించిన ఎరువును వారానికి రెండు దఫాలు లారీల్లో తీసుకెళ్తున్నారు. ఓ లారీ లోడ్ రూ.45 వేల వరకూ అమ్ముడు పోతున్నట్లు వాహన యజమానులు చెబుతున్నారు.


ఎరువును లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

ఎరువు నాణ్యతగా ఉంటుంది



మా ప్రాంతాల్లో గొర్రెల పెంపకం చాలా తక్కువ. ఆంధ్ర ప్రాంతంలో గొర్రెల పెంపకం ఎక్కువగా ఉంటుంది. దీంతో రొప్పాల వద్ద లభించే ఎరువు శక్తివంతమైనది. వాటిని పొలాల్లో వినియోగించడం ద్వారా మంచి దిగుబడి వస్తోంది. అలాగే భూమి కూడా సారవంతమవుతోంది.

– వెంకటేష్, రైతు, కర్ణాటక

పంటలు బాగా వస్తాయి



గ్రామాల్లో పశువుల ఎరువు స్వచ్ఛంగా ఉంటుంది. దాన్ని వినియోగించడం ద్వారా పంటలు బాగా దిగుబడి వస్తాయి. రసాయన ఎరువుల వాడకం కన్నా రొప్పల వద్ద లభించే ఎరువునే మేము వినియోగిస్తున్నాం. ట్రాక్టర్ ఎరువు 3 వేలు దాకా లభిస్తుంది.

– తిమ్మయ్య, రైతు, చెర్లోపల్లి

బీసీల ద్రోహి చంద్రబాబు

రొళ్ల: బీసీల ద్రోహి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాటు సీఎంగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు బీసీలకు చేసిందేమి లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత బీసీ వర్గాలకు రాజకీయ, విద్య, ఉద్యోగ పరంగా సముచిత న్యాయం కల్పించారని గుర్తు చేశారు. 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లును నియమించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. టీడీపీ నేతలు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు.

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సుమారు 400 మంది తిరుమలకు పాదయాత్రగా బయలు దేరారు. పేట వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్ర ప్రారంభించారు.

ప్రైవేటుకు దీటుగా 'సహకార' సేవలు


పెనుకొండ: జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి


సోమఘట్టలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం


గుడిబండలో సహకార జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుకొండ: ప్రైవేట్ బ్యాంక్‌లకు దీటుగా సహకార బ్యాంకు సేవలందిస్తోందని ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం సహకార సంఘం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జెండా ఎగురవేశారు. సిబ్బంది నాగభూషణం, నితిన్ విశ్వనాథ్, రంగలక్ష్మమ్మ, హరి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలోని సోమఘట్ట సహకార సంఘం కార్యాలయంలో 70వ సహకార సంఘం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం సింగిల్ విండో చైర్మన్ అమర్‌నాథ్ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో సహకార సంఘం వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటేశులు, రమేష్, లోకేష్, నాగచంద్ర, రైతులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలో సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో 70వ సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార సంఘం జెండాను సింగిల్ విండో అధ్యక్షుడు చంద్ర ఆవిష్కరించారు. తర్వాత రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మేనేజర్ గోపాల్‌రెడ్డి, రైతులు, సహకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లఖాసదానాసింగ్‌కు సన్మానం


కిసాన్ యోధా జాతీయ పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: కిసాన్ యోధా జాతీయ పురస్కార గ్రహీత, కిసాన్ ఆందోళన్ నాయకుడు లఖాసదానాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ కాలనీలో టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. లఖాసదానాసింగ్ మాట్లాడుతూ దేశంలోని రైతుల పక్షన ఉద్యమించడానికి ప్రాణాలు సైతం త్యాగం చేయడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు.

అన్నదానం పుణ్యకార్యం


మాలధారులకు అన్నదానం చేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: అన్నదానం పుణ్య కార్యమని, ప్రతి ఏడాది శ్రావణమాసంలో అయ్యప్ప మాలధారులందరికీ దీక్షా కాలంలో అన్నదానం చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులో అయ్యప్ప ఆలయంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప అన్నదాన కమిటీ చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


రొద్దంలో వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. పరిగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి విజయకుమారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

లేపాక్షి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్, క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి జయసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందిస్తామని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి శ్రీనివాసులు తెలిపారు.

రొద్దం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి నాగరాజు తెలిపారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప నుంచి కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు జమేదార్ రామలింగయ్య తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని 40 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

మడకశిరరూరల్: మండలంలోని ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో కార్తీక శనివారం పూజలు నిర్వహించారు. భక్తర పల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, చెందకచెర్లు అంజినేయస్వామి ,లక్ష్మీ నిమామిడమ్మ, వీరకేతమ్మ , నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక మాసపు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండలంలోని గంగులవాయిపాళ్యం వద్ద శనివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వారి నుంచి రూ.15 వేలతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం ఏ.పీ.చేనేత కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి తెలిపారు. అధ్యక్షుడిగా బండారు చెన్నకేశవులు, కార్యదర్శిగా అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడిగా జింక నాగరాజుతో పాటు సభ్యులను ఎంపిక చేశామన్నారు.

దందాలకు పాల్పడితే బహిష్కరణ


రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న డీఎస్పీ రామచంద్రప్ప

పావగడ: అక్రమ దందాలకు పాల్పడితే సరిహద్దు దాటిస్తామని మధుగిరి డీఎస్పీ రామచంద్రప్ప హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీయిజం మాని జన జీవన స్రవంతిలో కలిస్తే సమాజంలో ఉత్తమ ప్రజలవుతారని, లేకపోతే చెడ్డవాళ్లుగా మిగిలి పోతారన్నారు. తాలూకాలోని తిరుమణి, వైఎన్ హొసకోట, అరసికెర, పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధికి చెందిన 44 మంది రౌడీషీటర్లు కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు. పట్టణ సీఐ సురేశ్, రూరల్ సీఐ గిరీశ్ , ఎస్ఐలు తారాసింగ్, లక్ష్మణ్, మాళప్ప నాయ్కోడి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పళవల్లి రైల్వేబ్రిడ్జ్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించినట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన యాచకుడిగా అనుమానిస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు పావగడ పోలీస్‌స్టేషన్ 08136-245666కు సమాచారం ఇవ్వాలన్నారు.

శుభకార్యం

పెనుకొండ రూరల్: మండల సమీపంలోని కోన కన్యాశ్రమంలో దుద్దేబండ గ్రామానికి చెందిన వలంటీర్ భవాని వివాహ వేడుకకు ఎమ్మెల్యే శంకరనారాయణ శనివారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పెనుకొండ మండలంలోని చంద్రగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొల్ల ప్రభాకర్, సాయినాథ్ నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.

నాగారాజు మృతిపై విచారణ చేయండి

హిందూపురం టౌన్: కొటిపి గ్రామానికి చెందిన నాగరాజు మృతిపై అనుమానాలున్నాయని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సీపీఎం నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పాసు పుస్తకాలు మంజూరు చేయొద్దు

గోరంట్ల: 'మండల పరిధిలోని గౌనివారిపల్లి రెవెన్యూ పొలంలో 2009-2010 సంవత్సరంలో వోలీవర్ కంపెనీ కంగారెడ్డిపల్లి , జీనంవాండ్ల సమీపంలో భూములు కొనుగోలు చేశారు. అయితే అప్పట్లో కొంతమంది కంపెనీ ప్రతినిధులు, బ్రోకర్లు కుమ్మక్కై నకలీ పట్టా పాసుస్తుకాలు సృష్టించి కంపెనీ పేరుమీద రిజిస్టర్ చేశారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించాలి. అంత వరకూ వోలీయర్ కంపెనీ పేరుమీద పాసు పుస్తకాలు మంజూరు చేయొద్దు' అని పలువురు రైతులు శనివారం తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రైతులు బయపరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరామప్ప, నాగేంద్ర రెడ్డి, లక్ష్మీదేవమ్మ తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట


అలంకరణలో కనివే మారెమ్మ

అమరాపురం: మండలంలోని మద్దనకుంటలో శనివారం భక్తిశ్రద్ధలతో కనివే మారెమ్మ నూతన విగ్రహానికి ప్రాణ ప్రతిష్టాపన నిర్వహించారు. మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వివిధ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లేపాక్షి: లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ముబారక్ ట్రస్ట్, మణిశరణ్ మెమోరియల్ ట్రస్ట్ , ఉమర్ ఆప్టికల్స్, వైఎస్సార్ మెడికల్స్ హిందూపురం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం కూడా ఉంటుందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

హిందూపురం టౌన్: చిలమత్తూరు మండలంలోని టేకులోడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు యాచిస్తూ జీవించేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. వీఐకేఎఫ్ ఫౌండేషన్ చైర్మన్ రేణు చందనకు సమాచారం అందించగా వారు స్పందించారు. సభ్యులు దిలీప్, అఖిల్, ఉజైర్‌లు స్థానిక మోతుకుపల్లిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.